# మనం




## కృష్ణా / గుంటూరు

### ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు




మంగళవారం | 9 | జూన్ | 2026 | పేజీలు: 1 0


## అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

పర్యావరణాన్ని కాపాడండి

ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి రామచంద్రారెడ్డి



5 లో



# ప్రజల సంతృప్తే పనితీరుకు.. గీటురాయి



సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణం

అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలి

నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

పి.మీరాహుస్సేన్ ఖాన్

6 లో

-విజయవాడ, మనంబ్యూరో

## ఓటరు జాబితా పటిష్టతకు టీడీపీ శ్రేణులు కృషి చేయాలి

ఎస్ఐఆర్ ప్రక్రియను బాధ్యతగా నిర్వహించాలి

ఎంపీ కేశినేని చిన్ని

6 లో



## పశు సంపదతో గ్రామాల్లో సుస్థిర సంపద

అన్నదాతలకు అదనపు ఆదాయానికి వీలు

పాడి పశువుల్లో పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి

పశువుల ఉత్పాదకత పెంపునకు కార్యాచరణ

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

6 లో



# రాజ్యసభ ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట జూన్ 8 మనం న్యూస్: తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు రాజ్యసభ ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ పాల్గొన్నారు. రాజ్యసభ ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా ఎంపికైన చింతకాయల విజయ్, సాన సతీష్ కుమార్, భాష్యం రామకృష్ణ లు సోమవారం అమరావతిలోని శాసనసభ ప్రాంగణంలో తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నామినేషన్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తో కలిసి జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఏపీ పీఏసీ కమిటీ సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. పార్టీ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేసి, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల సాధనలో రాజ్యసభ సభ్యులుగా వారు సమర్థవంతంగా సేవలందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి, రాష్ట్ర హక్కుల సాధనకు రాజ్యసభలో వారు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలారు




**▸ మహిళలపై దాడులు, అక్రమ కేసులు, రైతులను ఆదుకోవడంలో విఫలం**

**▸ రౌండ్ టేబుల్ సమావేశంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు**

జగ్గయ్యపేట జూన్ 8 మనం న్యూస్: ఎన్నికలకు ముందు ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వ వెన్నుపోటు పొడిచిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు తో సహా వివిధ పార్టీల నేతలు ప్రముఖులు రౌండ్ టేబుల్ సమావేశంలో కూటమి ప్రభుత్వ వైఖరి పై ధ్వజమెత్తారు. జగ్గయ్యపేట పట్టణం ఆర్టీసీ డిపో దగ్గర ఎలక్ట్రికల్ యూనియన్ కార్యాలయం నందు కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ కార్యక్రమం పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్ అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో వామపక్ష నాయకులు పలు కార్మిక సంఘాలు, బీసీ సంఘ నాయకులు, పలూ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వ వైఫల్యాలను దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, ప్రముఖులు,మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో మహిళలు, రైతులు, యువత, పేదల అభ్యున్నతే లక్ష్యమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, వేధింపులు పెరిగినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో, పంట నష్టాలకు తగిన పరిహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. గతంలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రైతులు, మహిళలు, విద్యార్థులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రానున్న రోజుల్లో ప్రజల సమస్యలపై మరింతగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిపాలన విధానంలో గాని, అభివృద్ధి విధానంలో గాని పూర్తిగా విఫలం అయింది, అభివృద్ధి సంక్షేమమైన పథకాలు అడిగితే ఒక అమరావతి చూపించి చంద్రబాబు పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ కాదు దగాడిఎస్సి అనితీవ్రంగా ఖండించారు, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేస్తున్న మోసాలను రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజా ఉద్యమం చేస్తాం అని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ పార్టీ కార్యదర్శి అంబోజి శివాజీ , బీసీ ఉద్యమ నాయకులు తుమ్మాటి కృష్ణ మా చారి, , ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు నంబూరు చలపతిరావు , కాంగా వెంకటేశ్వరరావు , దర్శి వెంకటేశ్వర్లు, పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నిసా, సీనియర్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు, చల్లా వైకుంఠ రావు, మండల శ్రీనివాస్ గౌడ్, చింతకుంట్ల వెంకటరెడ్డి, బత్తుల రామారావు, కన్నమాల శ్యామల్, పెంటి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాసరావు, నంబూరి రవి, శివరాత్రి పృధ్వి, దర్శనాల వెంకటరమణ, ఆదోరి సుజాత, చల్లా సుశీల, మాతంగి నాగబాబు, గొర్రెపాటి బుల్లయ్య, బజార్ సాయి, శీలం మంగారావు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఆటోను ఢీకొన్న మినీ వ్యాన్

**▸ ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్ సందీప్ ను సి పి ఆర్ చేసి సొంత వాహనంలో వైద్యశాలకు తరలించిన కౌన్సిలర్ వట్టెం మనోహర్**

జగ్గయ్యపేట జూన్ 8 మనం న్యూస్: జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామం నేషనల్ హైవే వద్ద సందీప్ అనే ఆటో డ్రైవర్ ఆటోలో ఆగి ఉండగా వెనకనుంచి వచ్చిన ఓమ్ని వ్యాన్ అతివేగంగా వచ్చి గుద్దడంతో రెండు వాహనాలు చెట్లుకి గుద్దుకొని ప్రమాదానికి గురైయ్యాయి .ఈ సందర్భంలో సందీప్ ప్రమాద స్థితిలో స్పృహ లేకుండా పడిపోయి ఉన్న సమయంలోవెనకగా వస్తున్న జగ్గయ్యపేట వైసిపి మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ వెంటనే ఆగి ప్రమాదం జరిగినటువంటి ఆటోలో నుండి సందీప్ ను బయటకు తీసి రోడ్డు పక్కన పడుకోబెట్టి సిపిఆర్ చేశారు. సపరియలతో స్పృహలోకి వచ్చి న ఆటో డ్రైవర్ సందీప్ ను అక్కడ ఉన్న స్థానికుల సహాయంతో తన సొంత వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి కౌన్సిల్ సభ్యులు వట్టెం మనోహర్ హుటాహుటిన తరలించారు. డాక్టర్లతో మాట్లాడి అత్యవసర వైద్యాన్ని అందించమని కోరడం జరిగింది .అంతేకాకుండా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.



# బలుసు పాడు గురుధాంలో శ్రీ శివానంద గాన జ్ఞానామృత కళావాణి కార్యక్రమానికి శ్రీకారం



జగ్గయ్యపేట జూన్ 8 మనం న్యూస్ : మండలంలోని బలుసుపాడు గురు ధామ్ ధర్మక్షేత్రంలో శ్రీ శివానంద గాన జ్ఞానామృత కళావాణి కార్యక్రమం కు శ్రీకారం జరిగింది. భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా మన శాస్త్రీయ కళలను ప్రోత్సహించడం కోసం శివశ్రీ రమణ గురుదంపతులు సంకల్పించిన శ్రీశివానంద గాన జ్ఞానామృత కళావాణి కార్యక్రమానికి శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో సోమవారం శ్రీకారం జరిగింది . నల్లాన్ చక్రవర్తుల రంగాచార్యులు (కోదాడ) వారు తమ బృందంతో ఈ శ్రీశివానంద గాన జ్ఞానామృత కళవాణికార్యక్రమం ప్రారంభించారు . రేడియో వయొలిన్ కళాకారులు నల్లని చక్రవర్తుల అనంతకృష్ణ, నల్లాన్ చక్రవర్తుల కేశవ్, మృదంగం విధులు నల్లాన్ చక్రవర్తుల వరదరాజు, వి లక్ష్మీ అజయ్, వర్ధమాన సంగీత కళాకారులు కే నిఖిల్, మణికంఠ, ఎం.రోహిత్ లు గాత్ర కచేరి నిర్వహించారు. కళాకారులను శ్రీ శివానందగురు ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.ఈ శాస్త్రీయ సంగీత విభావరి మరియు శిక్షణ కార్యక్రమమునకు గురు కుటుంబ సభ్యులు, వివిధ గ్రామాల సంగీతాభిలాషులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి యెజ్డీ స్క్రాంబ్లర్ 350, బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650

గాంధీనగర్ జూన్ 8 మనం న్యూస్: యెజ్డీ, బీఎస్ఏ సంస్థలు తమ సరికొత్త స్క్రాంబ్లర్ మోటార్సైకిళ్లను మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చాయి. యెజ్డీ స్క్రాంబ్లర్ 350, బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650 మోడళ్లు హైదరాబాద్తో పాటు విజయవాడలోని అధీకృత డీలర్ కేంద్రాల్లో కూడా లభ్యమవుతున్నట్లు సంస్థ వెల్లడించింది. నగరాల్లో సౌకర్యవంతమైన ప్రయాణం, జాతీయ రహదారులపై స్థిరమైన పనితీరు, వారాంతాల్లో విహార యాత్రలకు అనువుగా ఈ వాహనాలను రూపొందించినట్లు తెలిపింది. భారతదేశంలో తేలికైన 350 సీసీ స్క్రాంబ్లర్గా యెజ్డీ స్క్రాంబ్లర్ 350ను పరిచయం చేశారు. కొత్త ద్రవ శీతలీకరణ సాంకేతికతతో పనిచేసే కటార్ ఇంజన్తో రూపొందిన ఈ వాహనం మెరుగైన శక్తి, వేగవంతమైన ప్రతిస్పందనను అందిస్తుందని సంస్థ పేర్కొంది. పట్టణ ప్రయాణాలు, చిన్న విహార యాత్రలకు అనువుగా దీన్ని తీర్చిదిద్దినట్లు తెలిపింది. ఈ మోటార్సైకిల్ ప్రారంభ ధర రూ.1,99,950గా నిర్ణయించారు. బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650 భారతదేశంలోని ఏకైక 650 సీసీ ఒంటరి సిలిండర్ ఇంజన్తో రూపొందిన స్క్రాంబ్లర్గా మార్కెట్లోకి వచ్చింది. సంప్రదాయ బ్రిటిష్ స్క్రాంబ్లర్ రూపకల్పనను ఆధునిక సాంకేతికతతో మేళవించిన ఈ వాహనం తక్కువ, మధ్యస్థ వేగాల్లో శక్తివంతమైన పనితీరును అందిస్తుందని కంపెనీ తెలిపింది. గోల్ స్టార్ కటాలినా, ఏ10 స్పిట్ఫైర్, ఏ65 ఫైర్బర్డ్ వంటి చారిత్రక మోడళ్ల స్ఫూర్తితో దీన్ని రూపొందించారు. దీని ప్రారంభ ధర రూ.3,24,950గా ఉంది. వాహనాల కొనుగోలుదారులకు నాలుగేళ్లు లేదా 50 వేల కిలోమీటర్ల ప్రమాణిత వారంటీ, ఆరు సంవత్సరాల వరకు పొడిగించిన వారంటీ, ఏడాది పాటు రహదారి పక్క సహాయ సేవలు అందించనున్నట్లు సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా 400కుపైగా విక్రయ, సేవా కేంద్రాల ద్వారా వినియోగదారులకు సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది.



# రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో అధునాతన ఫీటల్ మెడిసిన్ డిపార్టుమెంట్ ప్రారంభం



**రాజమండ్రి,జూన్,08,(మనం న్యూస్)ః** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గర్భిణీలకు అధునాతన గర్భధారణ వైద్య సంరక్షణను అందించాలని రాజమండ్రిలోని రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ నందు ఈ రోజు అధునాతనమైన ప్రత్యేక గర్భస్థ శిశు వైద్య విభాగాన్ని ప్రారంభించారు. రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ నందలి ఈ ప్రత్యేక విభాగం ఆవిష్కరణ కార్యక్రమానికి తూర్పు గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని (డి ఎం హెచ్ ఓ) డాక్టర్ ఎస్.వసుంధర ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆధునిక గర్భస్థ శిశు వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఫీటల్ వైద్య నిపుణురాలు డాక్టర్ వి. దివ్య భవానీ మాట్లాడుతూ ఈ ఆవిష్కరణ వలన రాజమండ్రి పట్టణ ప్రజలకు మాత్రమే కాక పరిసర జిల్లాలలోని గర్భిణీలకు ప్రత్యేక వైద్య సదుపాయములు అందుబాటు లోకి వచ్చాయని చెప్పారు. దీని ఫలితంగా గర్భిణీలకు ప్రసవానికి ముందు అవసరమైన ప్రత్యేక పరీక్షలు, రోగ నిర్ధారణలు, గర్భం నందలి పిండం పర్యవేక్షణా సేవలు చేరువలో ఉంటాయన్నారు. ప్రస్తుత ఆధునిక వైద్య పరిజ్ఞానంతో గర్భధారణకు సంబంధించిన అనేక సమస్యలను చాల ముందస్తుగా గుర్తించే అవకాశాలు ఉన్నాయి అన్నారు. సకాలంలో స్క్రీనింగ్ పరీక్షలు మరియు నిపుణుల పర్యవేక్షణ లతో గర్భంలోని పిండం/బిడ్డ వివిధ దశలలో పెరుగుదల, అభివృద్ధి, వివిధ సమస్యలను గుర్తించి సరైన చికిత్సను సకాలంలో అందించగలము అన్నారు. సురక్షితమైన గర్భాలు ద్వారా ప్రతి బిడ్డకు ఆరోగ్యకరమైన ఆరంభాన్ని అందించడమే మా లక్ష్యం' అని తెలిపారు. గర్భిణీల ఆరోగ్య సంరక్షణలో గర్భస్థ శిశు వైద్యం అనేది ఒక ప్రత్యేక విభాగం. గర్భధారణ సమయంలో శిశువు ఆరోగ్యం మరియు వివిధ దశల వృద్ధి పైన ఈ విభాగం దృష్టి సారిస్తుంది. ముందస్తుగా ఎలాటి సమస్యలనైన గుర్తించి వైద్య బృందాలు సరియైన చికిత్సా విధానంతో తల్లి బిడ్డ లిరువురికి మంచి ఫలితాలను అందించడానికి ఈ విభాగం తోడ్పడుతుంది. ఈ విభాగంలో అసాధారణ స్కానింగ్ యంత్రాలు, పిండం పెరుగుదల, ఆరోగ్యం అంచనాలు, క్రోమోజోమల్ జన్యుపర సమస్యల పరీక్షలు, పిండం ఎకోకార్డియోగ్రఫీ, వైద్యుల నిరంతర పర్యవేక్షణలు అందుబాటులో ఉంటాయి. తల్లికి సంభందించిన అనేక అనారోగ్య సమస్యలు ముందుగా గుర్తించి, వాటి ప్రభావం గర్భస్థ శిశువుకు సోక కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటంలో ఈ ప్రత్యేక విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కొత్త విభాగం ప్రారంభంతో గర్భిణీలకు అనేక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వచ్చి, ప్రసవానికి ముందు అవసరమైన సంరక్షణ సులభంగా, సౌకర్యంగా అందుతుంది. ఈ ప్రాంతంలో తల్లి మరియు నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణకు తాము కట్టుబడి, తల్లిబిడ్డలకు ఆరోగ్యకరమైన ఫలితాలను అందిస్తామని పేర్కొన్నారు.



# విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య




**గాంధీనగర్, జూన్ 8 మనం న్యూస్ః** విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం స్థానిక హోటల్లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి వందలాది మంది పాస్టర్లు, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి ప్రముఖ క్రైస్తవ నాయకులు, యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కోలా ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ పాట్రన్స్ డా. దేవ దండల హోస్ట్ చేయగా , బిషప్ రక్షణానంద్ ఇతర ప్రముఖ క్రైస్తవ నాయకులు పాల్గొని దేవుని వాక్యాన్ని బోధించారు. ఫెలోషిప్ సెక్రటరీ రెవ. బి రవికాంత్, ట్రెజరర్ రెవ. బి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ క్రైస్తవ సమాజమంతా ఐక్యంగా ఉండి దేశ శ్రేయస్సు కోసం, సమాజంలో నైతిక విలువల పెంపుదల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేవుని వాక్యమైన బైబిల్ బోధించిన ప్రకారం రాజులు, అధికారులు సమస్త ప్రజల కొరకు ప్రార్థనలు, విజ్ఞాపనలు చేయాలని సూచించారు. దేశంలో శాంతి, సామరస్యం, ఆధ్యాత్మిక విలువలు వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమావేశం ఆధ్యాత్మిక సందేశాలు, ప్రార్థనలు పరస్పర సహవాసంతో ఆశీర్వాదకరంగా ముగిసింది.

# వెన్నుపోటుకు రెండేళ్ళు పై మహిళలతో టౌన్ హాల్ సమావేశం నిర్వహించిన డాక్టర్ జగన్మోహన రావు

**నందిగామ,జూన్7(మనం న్యూస్)ః** నందిగామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ హాల్ సదస్సులో మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పాల్గొని ప్రశగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఐదేళ్ల పాలనలో మహిళా సాధికారతకు పెద్దపేట వేసారన్నారు.ముఖ్యంగా అభివృద్ధి సంక్షేమ పథకాలలో సైతం మహిళలకు తొలి ప్రాధాన్యతని ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా సాధికారతలో భాగంగా జగన్మోహన్ రెడ్డి అమూల్, హిందుస్థాన్ లివర్, ట్రాక్టర్ అండ్ గ్యాంబుల్, ఐటీసీ, రిలయన్స్ తీసుకొచ్చారని, రెండేళ్లలో చంద్రబాబు తీసుకొచ్చింది ఏంటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

**మహిళలను మోసగించిన బాబు ప్రభుత్వం.**

చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర మహిళలు మోసగించిన పార్టీ అని ముఖ్యంగా మహిళా సాధికారతకు రెండేళ్లుగా పాత్ర వేశారని ఆయన మండిపడ్డారు. రెండేళ్లుగా చంద్రబాబు హామీలు నీట మూటలుగా మిగలడంతో అక్కాచెల్లెమ్మలు ఆశలు అడియాశలు అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న చంద్రబాబు ఒక ఏడాదికి ఒక సిలిండర్ మాత్రమే అందించారని అది కూడా పూర్తిస్థాయిలో అందించలేకపోయారని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 ఇస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి మొండి చేయి చూపారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలను నిలుపుదల చేయడమే కాకుండా ఇస్తామన్న హామీలను సైతం చంద్రబాబు గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా మహిళలకు ఉచిత బస్సు అనే ఓదరగొట్టి ఆర్టీసీలో 16 క్యాటగిరిలో బస్సులు ఉంటే కేవలం ఐదు కేటగిరీలకు పరిమితం చేశారని కొత్తగా పోనీ బస్సుల్లో ఉచితం లేదని ప్రకటించిన మహానుభావుడు అని ఏద్దేవా చేశారు.

**కూటమి పాలన లో మహిళలకు రక్షణ కరువు**



గత ప్రభుత్వ హయాంలో దిశా చట్టంతో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తే నేడు రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని జగన్మోహనరావు పేర్కొన్నారు. విశాఖ కార్యక్రమాలు రద్దు చేసిన చంద్రబాబు మహిళల్లో చిన్నారుల రక్షణ భద్రతను ప్రమాదంలోకి నెట్టివేశారని వివరించారు. ఇప్పటికైనా మహిళల్లో చైతన్యం రావాలని ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజాప్రతినిధులను నిలదీయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, అంగన్వాడి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శాఖమూరి వెంకట కుమారి, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, మార్తా రజని, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, ఇందిరా, కర్ల రాధిక, బుడ్డి విజయలక్ష్మి, నాయుడు ఉదయలక్ష్మి,అమర్లపూడి రత్నకుమారి, కస్తాల పున్నమ్మ కంచర్ల పద్మ బండారు విజయలక్ష్మి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్టు సమగ్ర పరివేక్షణలో బిఎల్ఏలది ముఖ్య పాత్ర



**డాక్టర్ మొండితోక జగన్మోహనరావు**

**నందిగామ,జూన్7(మనం న్యూస్)ః** ఈ నెల 15 వ తేది నుండి రాష్ట్రం వ్యాప్తంగా జరగనున్న ఓటర్ లిస్టు సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) కార్యక్రమం లో నందిగామ నియోజకవర్గం లోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం, బిఎల్ఏ లు అందరు అప్రమత్తంగా ఉండి ఓటర్ లిస్టు ప్రత్యేక పరిశీలన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం బూత్ ఏజెంట్లు (బిఎల్ఏ ) లు అందుబాటులో ఉండి , పార్టీ నాయకులతో కలసి సమన్వయం చేసుకొని పని చేయాలని తెలిపారు.బిఎల్ఏ లు వారి బూత్ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి బిఎల్వో లు ఇంటింకి వచ్చినప్పుడు మన పార్టీ సానుభూతి ఓటర్లను అందుబాటులో ఉండి, వారికి సహకరించలని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో చందర్లపాడు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# బహు విషయ విజ్ఞాని రామోజీ



**గాంధీనగర్ జూన్ 8 మనం న్యూస్ః** బహు ముఖ ప్రజ్ఞాశాలి, జర్నలిజానికి దిక్సూసి, రైతు శ్రేయస్సు నుంచి ప్రభుత్వం ఏర్పాటు లాంటి రాజకీయ రంగ పరిజ్ఞానం, పారిశ్రామికంగా పరిశ్రమించి సైతం ఎదిగిన కష్టమెరిగిన శ్రమజీవి, ఆర్థిక రంగ నిపుణుడు, పత్రికలో సంపాదకీయం రాయడం ద్వారా జన చైతన్యం కలిగించిన రచనా శైలి శీలుడు, బుల్లి తెర, వెండి తెరలపై విలువలు నింపి, ప్రపంచ స్థాయి రామోజీ ఫిలిం సిటీకి జీవం పోసి, కుటుంబ సభ్యుల ను ప్రయోజకులుగా తీర్చిదిద్ది ఉభయ తెలుగు రాష్ట్రాలు లో నే కాక దేశ విదేశాలలో సైతం చెరగని సుస్థిర స్థానం నిలుపుకున్న మహోన్నత వ్యక్తి మంచితనం మూర్తీభవించిన మహనీయుడు రామోజీ రావు అని ప్రముఖ సాహితీ సామాజిక వేత్త , వేముల చారిటీస్ చైర్మన్ డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఈ సోమవారం రామోజీ రావు ద్వితీయ వర్ధంతి ని పురస్కరించుకొనిగాంధీ నగర్ సంస్థ కార్యాలయం లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ ట్రస్టీ చలవాది వంశీ కృష్ణ, కన్వీనర్ మేడా చలమయ్య, న్యాయవాదులు పి. రవికుమార్, పైడిపాటి భాను,ఆళ్ళ వెంకట్రావు , పి. రమేష్ , ప్రసాద్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# గ్రామ సచివాలయాలు పేరు మార్పులో సీఎం చంద్రబాబు ఆశయానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కొందరు గ్రామ కార్యదర్శుల



- గ్రామ సచివాలయానికి స్వర్ణ గ్రామపంచాయతీ గా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఘనత ఒక కార్యదర్శిదే..
- ప్రభుత్వ జీవోలను కూడా సక్రమంగా పరిశీలించని కార్యదర్శులు కు బాధ్యతలు గుర్తు చేయాల్సిన బాధ్యత జిల్లా ఉన్నతాధికారులపై ఉంది..

**పామర్రు, జూన్ 08( మనం న్యూస్ ):** అవినీతికి ఆస్కారం లేని విధంగా పేద ప్రజలు ప్రభుత్వ సేవలను సత్వరమే అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంమేరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను 'స్వర్ణ గ్రామం' / 'స్వర్ణ వార్డు' (ఎస్ జి ఎస్ డబ్ల్యు ) గా మారుస్తూ 2026 ఫిబ్రవరిలో అధికారికంగా ఉత్తర్వులు (జీవో ఎంఎస్ నెంబర్ 21) జారీ చేసింది. ఈ పేరు మార్పు వెనుక పేదలకు ప్రభుత్వ సేవల్లో ఎలాంటి జాప్యం, అవినీతి లేకుండా అత్యంత వేగంగా, పారదర్శకమైన పాలనను అందించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయం.అయితే, ఈ మార్పు తర్వాత క్షేత్రస్థాయిలో సచివాలయ కార్యదర్శులు కొందరు ప్రభుత్వం యొక్క అసలు లక్ష్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నా రంటూ ప్రజల నుండి, ఉన్నతాధికారుల నుండి కొన్ని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జీవో కి వ్యతిరేకంగా కొందరు మండల స్థాయి అధికారులకు తాను పంచాయతీ కార్యాలయం గానే రాస్తానంటూ వక్రభాష్యాన్ని ఓ కార్యదర్శి వెల్లడించినట్లు తెలుస్తుంది. ఆ మేరకు 3 ఖరీదు చేసే ఫ్లెక్సీ తో స్వర్ణ గ్రామ పంచాయతీగా పెట్టడం అధికారులతో పాటు గ్రామ ప్రజలను విస్మయనికి గురిచేసింది. సేవల్లో జాప్యం: కొత్తగా మారిన పాలనా వ్యవస్థ మరియు విజన్ యూనిట్ల స్ఫూర్తిని అందిపుచ్చుకోవడంలో కొందరు కార్యదర్శులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. జవాబుదారీతనం లోపించడం, ప్రభుత్వ సేవలు మరియు సంక్షేమ పథకాలు వేగంగా ప్రజలకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఫిర్యాదుల పట్ల స్పందన,ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి భిన్నంగా, కార్యదర్శులు స్పందించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో, పాలనలో సమర్థతను, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ఉద్యోగుల హేతుబద్ధీకరణ, శాఖల సర్దుబాటు వంటి చర్యలనుమరో వైపు చేపడుతోంది. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కొత్త సంస్కరణలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రావాలంటే కార్యదర్శుల పనితీరులో జిల్లాస్థాయి అధికారులుమరింత మార్పు రావాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీనిపై ఎంపీడీవో స్పెషల్ ఆఫీసర్లు అలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధమని తక్షణమే మార్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

# సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాల మరియు కళాశాల బస్సుల తనిఖీ, అవగాహన కార్యక్రమం



**మైలవరం జూన్ 08 మనం న్యూస్ః** ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఆదేశాల మేరకు, విజయవాడ రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ, మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు కొత్తూరు ఆధ్వర్యంలో, మార్కెట్ యార్డ్లో జి.కొండూరు, మైలవరం మరియు రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాల మరియు కళాశాల బస్సులపై సమగ్ర తనిఖీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, కొద్ది రోజుల క్రితం బస్సు యజమానులు, విద్యాసంస్థల ప్రతినిధులు మరియు డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, బస్సులలో తప్పనిసరిగా ఉండవలసిన భద్రతా ప్రమాణాలు, పత్రాలు మరియు ఇతర నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు, తనిఖీలకు హాజరు కావాలని సూచించడం జరిగింది. నిర్వహించిన తనిఖీలలో మొత్తం 91 పాఠశాల మరియు కళాశాల బస్సులను పరిశీలించడం జరిగింది. తనిఖీలలో భాగంగా, బస్సులకు సంబంధించిన ఆర్సి బుక్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, పర్మిట్ తదితర అవసరమైన పత్రాలను పరిశీలించడం జరిగింది. ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ ఎక్స్టింగ్విషర్, స్పీడ్ గవర్నర్, అత్యవసర నిర్గమ ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్), రియర్ వ్యూ మిర్రర్లు, విండ్షీల్ గాజులు మరియు ఇతర భద్రతా పరికరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేయడం జరిగింది. విద్యార్థుల భద్రతకు అనుగుణంగా బస్సుల తలుపులు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ సౌకర్యాలు మరియు ఇతర భద్రతా ప్రమాణాలను పరిశీలించడం జరిగింది. బస్సు డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉన్నాయా లేదా అని తనిఖీ చేయడంతో పాటు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అవగాహన కల్పించడం జరిగింది. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించ రాదని సూచించడం జరిగింది. ప్రతి బస్సులో తప్పనిసరిగా ఒక అటెండర్ ఉండాలని, అతను మంచి నడవడిక కలిగి ఉండాలని, విద్యార్థులందరూ సురక్షితంగా బస్సు దిగిన తర్వాత మాత్రమే బస్సును కదిలించాలని ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ, ఐపీఎస్ కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లు, విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులకు రోడ్డు భద్రత, విద్యార్థుల భద్రత మరియు రవాణా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వారందరితో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల భద్రత అందరి బాధ్యత అని పేర్కొంటూ, పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్యాలు, డ్రైవర్లు పోలీసు శాఖ నిర్దేశించిన భద్రతా ప్రమాణాలు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ, ఐపీఎస్, మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు కొత్తూరు, జి.కొండూరు ఎస్ఐ కె. సతీష్ కుమార్, మైలవరం ఎస్ఐ-2 గిరి సాయి, రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ సిబ్బంది, మైలవరం సర్కిల్ పోలీస్ సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లు మరియు అటెండర్లు పాల్గొన్నారు.




# విత్తనాలు ఎరువులను అధిక ధరలకు విక్రయి స్తే చర్యలు తప్పవు



- మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి

**పామర్రు, జూన్ 08( మనం న్యూస్):** ప్రస్తుత వ్యవసాయ సీజన్లో రైతులకు అవసరమైన విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని పామర్రు మండల వ్యవసాయ అధికారిని వి. శివ నాగరాణి దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణంలో పలు లైసెన్స్ గల విత్తన దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విత్తన దుకాణదారులు సీడ్యాక్ట్ ప్రకారం విత్తనాలు రైతులకు విక్రయించాలని లేనిచో చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు గుర్తింపు కలిగిన విత్తన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు కూడా తీసుకోవాలని రైతులను కోరారు. తీసుకెళ్లిన విత్తనాలను మొలక కట్టే మొలక శాతం వచ్చిన తర్వాత మాత్రమే నారుమొళ్ళు పోసుకోవాలని రైతులకు వివరించారు. విత్తనాల కొన్న సంచులు ట్యాగు లను రైతులు భద్రపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఏఏ లు పాల్గొన్నారు.

# ఆంధ్ర ప్రదేశ్ బేడ బుడ్గ జంగం కులమునకు ప్రాధమిక హక్కులు కల్పించండి



- రాష్ట్ర అధ్యక్షులు సంకుల సతీష్ కుమార్

**గాంధీనగర్ జూన్ 8 మనం న్యూస్:** భారత రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన ఎస్సీ కులాలలో బేడ (బుడ్గ) జంగం కులం కూడా ఒకటి అని సోమవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు సతీష్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1956 సం' తరువాత అనేక కుటుంబాలు జీవనోపాధి నిమిత్తం తెలంగాణ నుండి ఆంధ్రా ప్రాంతంకు రావడం జరిగింది అని 1976 సం' లో భారత్ ప్రభుత్వం ఎస్.సి ఎస్.టి సవరణ చట్టం ద్వారా ప్రాంత పరిమితి తొలగించడంతో మాకు ఎస్సీ హక్కులు లచించాయని కాని కొంతమంది అధికారుల కుట్రలవల్ల, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో మా జాతికి కనీస ప్రాథమిక హక్కులు లేకుండా పోయాయి తెలిపారు.2008 నుండి ఇప్పటి వరకు మాకు చదువుకునే అవకాశం లేకుండా పోయింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి ఫలితం రాలేదు. గత 18 సం'లనుండి మేము శరణార్ధులు లాగా, అంటరానివారిలాగానే జీవిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం మా దీన స్థితిని గమనించి 2017లో జె.సి శర్మ కమీషన్ నియమించిచింది అందులో మా జాతికి జరిగిన ద్రోహం అక్షరాస్యతలో అట్టడుగు స్థానంలో ఉన్నాం అని తెలిపింది దయచేసి ఆ కమీషన్ రిపోర్టు ప్రకారం అయిన మాకు న్యాయంచేయండి.1981, 1991, 2012 జనాభా లెక్కల ప్రకారం మేము ఉన్నాం అని రుజువు చేస్తున్నాయి.మాకు కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయండి. కొంత మంది అధికారులు నిరక్షరాసులమైన మాజాతికి తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు తీసుకోమని బలవంతం చేస్తున్నారు. ఇది ప్రభుత్వ పెద్దల కుట్రలాగా కనిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ మంది శ్రీనివాసరావు,గంజాల శ్రీనివాసరావు, కప్పిరి నాగయ్య,మోతె రాంప్రసాద్,కొండపల్లి మర్గారావు ,పత్తి తిరపతిరావు, పరదేశి సుబ్బారావు,ఇంగువ చిన్న అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

# ఒరిగిన విద్యుత్ స్తంభాలు... విద్యుత్ పునరుద్ధరణ చేయని అధికారులు



**తాడేపల్లి, జూన్ 8, మనం న్యూస్‌:** గత గురువారం కురిసిన అకాల భారీ వర్షానికి, ఈదురు గాలులకు ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి లో దాశెట్టి వెంకటేశ్వర్లు, కుటుంబరావు పంట పొలాలలో విద్యుత్ స్తంభాలు విద్యుత్ తీగలు తెగి నేలకొరిగాయి. గాలివాన కురిసి వారం రోజులవుతున్న సంబంధిత విద్యుత్ అధికారులు పంట పొలాలలో విద్యుత్ స్తంభాలను సరిచేసి, విద్యుత్తు పునర్ధరణ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలంలో విద్యుత్ వైర్లు తెగి కిందపడిన అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీంతో చుట్టుపక్కల పొలాలలో పంటలకు, ఆకుకూర మడులకు నీళ్లు పెట్టుకునేందుకు విద్యుత్తు సప్లై లేకపోవడంతో రైతులతో పాటు కౌలు రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. తక్షణమే తాడేపల్లి మండల విద్యుత్ అధికారులు సమస్యపై స్పందించాలని, విద్యుత్తు పునరుద్ధరించి, పంట పొలాల విద్యుత్ సప్లై ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

# ఆరు నెలల్లో భారతదేశ స్వచ్ఛ పారిశ్రామిక ప్రాజెక్టుల పైప్లైన్ 30% పెరిగి, 433 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశానికి చేరుకుంది

**విజయవాడ, 8 జూన్ మనం న్యూస్‌:** పెరుగుతున్న భౌగోళిక రాజకీయ మరియు సరఫరా గొలుసు అనిశ్చితి నడుమ, దేశాలు మరింత పటిష్టమైన ఇంధన మరియు ఉత్పాదక వ్యవస్థలను నిర్మించడానికి పోటీ పడుతున్న తరుణంలో, భారతదేశం తన తక్కువ-కార్బన్ పారిశ్రామిక ప్రాజెక్టుల పైప్లైన్ను ఆరు నెలల కాలంలో 30% పెంచుకుని, ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన స్వచ్ఛ పారిశ్రామిక మార్కెట్లలో ఒకటిగా వేగంగా ఆవిర్భవిస్తోంది. మిషన్ పాజిబుల్ పార్టనర్షిప్ యొక్క తాజా గ్లోబల్ ప్రాజెక్ట్ ట్రాకర్ ప్రకారం, ప్రాజెక్టుల సంఖ్య పరంగా భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్వచ్ఛ పారిశ్రామిక ప్రాజెక్టుల పైప్లైన్ను కలిగి ఉంది. దీనికంటే ముందు చైనా మరియు యునైటెడ్ స్టేట్స్ మాత్రమే ఉన్నాయి. ఈ పైప్లైన్ నాలుగు రంగాలలో మరియు 11 రాష్ట్రాలలో 65 ప్రాజెక్టులను కలిగి ఉంది. ఇది స్వచ్ఛ ఇంధనాలు, రసాయనాలు మరియు తక్కువ-కార్బన్ ఉత్పాదక రంగాలలో సుమారుగా 433.07 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశాన్ని సూచిస్తుంది. భారతదేశం యొక్క విస్తరిస్తున్న స్వచ్ఛ పారిశ్రామిక పైప్లైన్, దాని పారిశ్రామిక ఆశయాలు మరియు ఇంధన పరివర్తన లక్ష్యాల మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని ప్రతిబింబిస్తుంది. దీనికి గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధనం, ఉత్పాదక రంగం మరియు ఇంధన భద్రతకు సంబంధించిన విధానపరమైన కార్యక్రమాలు మద్దతు ఇస్తున్నాయి. దేశాలు తమ సరఫరా గొలుసులను వైవిధ్యపరచుకోవడానికి, అస్థిరమైన శిలాజ ఇంధన మార్కెట్లపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో, తక్కువ ఖర్చుతో కూడిన పునరుత్పాదక ఇంధనంతో నడిచే తదుపరి తరం పారిశ్రామిక ఉత్పత్తికి భారతదేశం ఒక పోటీతత్వ గమ్యస్థానంగా తనను తాను నిలబెట్టుకుంటోంది. ఈ ట్రాకర్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మరియు ఛత్తీస్గఢ్తో సహా 11 రాష్ట్రాలలో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్, సుస్థిర విమాన ఇంధనం (ఖిఅఊ) మరియు తక్కువ-కార్బన్ అల్యూమినియం రంగాల్లోని ప్రాజెక్టులను మ్యాప్ చేస్తుంది. 49 ప్రాజెక్టులతో గ్రీన్ అమ్మోనియా ఈ పైప్లైన్లో ఆధిపత్యం చెలాయిస్తుండగా, పెరుగుతున్న ఖిఅఊ కార్యకలాపాలు స్వచ్ఛమైన విమాన ఇంధనాలపై పెరుగుతున్న ఆసక్తిని మరియు సంభావ్య ఎగుమతి అవకాశాలను సూచిస్తున్నాయి. ట్రాక్ చేయబడిన ప్రాజెక్టులలో అఇ గ్రీన్ యొక్క కాకినాడ అభివృద్ధి పనులు, ఒడిశాలోని అఇఊ యొక్క గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్, ఇండియన్ ఆయిల్ యొక్క ఖిఅఊ కార్యక్రమాలు,ౡఖీఇ యొక్క పుడిమడక ప్రతిపాదనలు, మరియు ఒడిశా, ఛత్తీస్గఢ్లలో వేదాంత యొక్క తక్కువ-కార్బన్ అల్యూమినియం కార్యకలాపాలు ఉన్నాయి. కొత్త స్వచ్ఛ పారిశ్రామిక విలువ గొలుసులు రూపుదిద్దుకుంటున్న తరుణంలో, భారతీయ మరియు ప్రపంచ కంపెనీల మధ్య సహకారం పెరుగుతోందని కూడా ఈ పరిశోధన ఫలితాలు సూచిస్తున్నాయి. అఇఊ యొక్క గ్రీన్ హైడ్రోజన్ మరియు అమ్మోనియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అయిన అర్నవ సిన్హా ఇలా అన్నారు: 'భారతదేశం యొక్క గ్రీన్ హైడ్రోజన్ ప్రస్థానం ఆశయాల నుండి వాస్తవ రూపంలోకి నిశ్చయంగా అడుగుపెడుతోంది, మరియు ఈ ప్రయాణంలో అగ్రగామిగా ఉన్నందుకు అఇఊ గర్విస్తోంది. ఖిఉఇఐ యొక్క అనేక గ్రీన్ అమ్మోనియా వేలంపాటలలో విజేతగా నిలిచిన బిడ్డర్గా, మేము హామీతో కూడిన కొనుగోళ్లు, పారదర్శక ధరల నిర్ధారణ మరియు ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల టారిఫ్ల ఆధారంగా ఒక మార్కెట్ను స్థాపించడంలో సహాయపడ్డాము. తక్కువ ఖర్చుతో కూడిన పునరుత్పాదక ఇంధనం, పటిష్టమైన విధానపరమైన దిశానిర్దేశం మరియు పెరుగుతున్న ప్రాజెక్ట్ అనుభవాలతో, గ్రీన్ అమ్మోనియా మరియు స్వచ్ఛ ఇంధనాలకు ప్రపంచ కేంద్రంగా మారడానికి భారతదేశం సరైన స్థితిలో ఉంది. ఐఖీఅ వంటి కార్యక్రమాల మద్దతుతో, ఈ ఊపును పూర్తిస్థాయి ప్లాంట్లుగా మరియు పెద్ద ఎత్తున విశ్వసనీయమైన సరఫరాగా మార్చడమే ఇప్పుడు మా కర్తవ్యం.' ప్రభుత్వాలు మరియు కంపెనీలు మరింత పటిష్టమైన మరియు పోటీతత్వ పారిశ్రామిక వ్యవస్థలను కోరుకుంటున్నందున, ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛ పారిశ్రామిక పెట్టుబడులు వేగవంతమవుతున్నాయి. మిషన్ పాజిబుల్ పార్టనర్షిప్ విశ్లేషణ ప్రకారం, ప్రాజెక్టులు తుది పెట్టుబడి నిర్ణయానికి చేరుకునే వేగం గత సంవత్సరంలో రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగింది, ఇది రికార్డు స్థాయిలో అత్యంత వేగవంతమైనది, ప్రస్తుతం ఈ అమలులో చైనా అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛ ఉత్పాదక రంగం విస్తరిస్తున్న కొద్దీ, భారతదేశంతో సహా పునరుత్పాదక ఇంధన సమృద్ధిగల ఆర్థిక వ్యవస్థలతో కూడిన ఒక కొత్త 'పారిశ్రామిక సన్బెల్ట్' ఆవిర్భవిస్తున్న విషయాన్ని కూడా ఈ నివేదిక హైలైట్ చేస్తుంది. ఈ ఆర్థిక వ్యవస్థలు దీర్ఘకాలిక పారిశ్రామిక ప్రయోజనాన్ని పొందగలవు. స్వచ్ఛ పారిశ్రామిక ప్లాంట్లు రికార్డు స్థాయిలో అత్యంత వేగంగా ఫైనాన్స్ను పొందుతున్నాయి. 'స్వచ్ఛ పారిశ్రామిక రంగం కేవలం వాగ్దానాల దశ నుండి వాస్తవ వేగాన్ని అందుకుంటోంది. గత సంవత్సరంలో తుది పెట్టుబడి నిర్ణయానికి చేరుకుంటున్న ప్రాజెక్టుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగింది,' అని మిషన్ పాజిబుల్ పార్టనర్షిప్ సీఈఓ మరియు ఇండస్ట్రియల్ ట్రాన్సిషన్ యాక్సిలరేటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన ఫాస్టిన్ డెలాసల్లే అన్నారు. 'రోజురోజుకూ విచ్ఛిన్నమవుతున్న, అస్థిరంగా మారుతున్న వాతావరణంలో, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం అనేది ధరల హెచ్చుతగ్గులు, సరఫరా అంతరాయాలు, ఆర్థిక సంక్షోభాలకు దారితీస్తుందని పదేపదే రుజువైంది. అదే సమయంలో ఇది వాతావరణ సంక్షోభాన్ని, దాని సంచిత ప్రభావాలను మరింత తీవ్రతరం చేస్తూనే ఉంది. స్వచ్ఛమైన పారిశ్రామిక వ్యవస్థలను నిర్మించుకునే దేశాలు, ప్రజల జీవితంలోని ప్రతి కోణానికి ఆధారమైన ఇంధనం, ఆహారం, ముడి పదార్థాలు, పారిశ్రామిక వస్తువులు వంటి తమ ఆర్థిక వ్యవస్థలకు అత్యవసరమైన వాటిపై మరింత నియంత్రణను పొందగలవు,' అని ఆమె అన్నారు. ఇండస్ట్రియల్ ట్రాన్సిషన్ యాక్సిలరేటర్ ఇండియా లీడ్ యశ్ కశ్యప్ మాట్లాడుతూ, 'భారతదేశం ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన తొలిదశ స్వచ్ఛ-పరిశ్రమల పైప్లైన్లలో ఒకదాన్ని నిర్మిస్తోంది. ప్రస్తుతం పలు రంగాలలో, రాష్ట్రాలలో దీని కార్యకలాపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విధానపరమైన మద్దతు, ఆర్థిక సహాయం, మార్కెట్ డిమాండ్ను వేగవంతం చేయడం ద్వారా ప్రకటనల దశను దాటి ఆచరణలోకి వెళ్లడమే ఇప్పుడున్న అవకాశం. భారతదేశం తన పునరుత్పాదక ఇంధన ప్రయోజనాన్ని పారిశ్రామిక స్థాయికి మార్చగలిగితే, రాబోయే దశాబ్దంలో స్వచ్ఛ తయారీ, ఇంధనాలు, ఎగుమతులకు ఒక ముఖ్యమైన ప్రపంచ కేంద్రంగా మారే సామర్థ్యం దానికి ఉంది,' అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛ పారిశ్రామిక పెట్టుబడులు వేగవంతమవుతున్న తరుణంలో, భారతదేశం ఒక విస్తృతమైన అల్ప-కార్బన్ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థకు ఎలా స్థిరంగా పునాదులు వేస్తోందో గ్లోబల్ ప్రాజెక్ట్ ట్రాకర్ హైలైట్ చేస్తోంది.

# ఈనెల 10న జిల్లాలో డెడికేటెడ్ కమిషన్ పర్యటన

**అవనిగడ్డ,జూన్ 8( మనం న్యూస్ ):** డెడికేటెడ్ కమిషన్ కృష్ణాజిల్లాలో ఈ నెల 10న పర్యటించనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సాధికార అధికారి జి.రమేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాజీవ్ రంజన్ మిశ్రా చైర్మన్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలు బీసీ సంఘాలు సామాజిక సంస్థలు ప్రజా సంఘాలు మేధావులు ఇతర సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలు వ్యక్తిగత సూచనలు వినతి పత్రాలు కమిషన్ స్వీకరించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో అన్ని సంబంధిత వర్గాల వారు పదో తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశం హాల్లో జరిగే సమావేశంలో సామాజిక ఆర్థిక పరిస్థితులు ఇతర సంబంధిత అంశాలపై ఆసక్తి గల వ్యక్తులు సంస్థలు సంఘాల వారు లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలను కమిషన్ కు సమర్పించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సంబంధిత సంఘాల వారు వినియోగించుకోవాలని రమేష్ కోరారు.



# అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

- **పర్యావరణాన్ని కాపాడండి**
- **బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి రామచంద్రారెడ్డి**



**మార్కాపురం,జూన్,08,(మనం న్యూస్)‌:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు. ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ కోసం సామాజిక ఉద్యమంగా మొక్కల పెంపకాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అలాగే ఒక మొక్కను నాటడం అంటే కేవలం ఒక చెట్టును పెంచడం కాదు, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడం అని డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. మన తల్లి మనకు జన్మనిచ్చి జీవితాన్ని ప్రసాదించినట్లే, చెట్లు కూడా మనకు ప్రాణవాయువును అందించి జీవనాన్ని కొనసాగిస్తాయని పేర్కొన్నారు. అందుకే అమ్మ ప్రేమకు, త్యాగానికి గుర్తుగా ఆమె పేరుతో ఒక మొక్కను నాటడం అత్యంత గొప్ప సేవ అని చెప్పారు. కాగా నానాటికీ చెట్ల సంఖ్య తగ్గిపోతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, దాని ప్రభావం వాతావరణ మార్పుల రూపంలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉష్ణోగ్రతలు పెరగడం, తీవ్రమైన ఎండలు, వర్షాల అసమానత, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు చెట్ల నరికివేత కూడా ప్రధాన కారణమని అన్నారు. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన గ్రామాలు, పట్టణాలు నేడు కాంక్రీట్ అడవులుగా మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అలాగే వర్షపాతం పెరగడానికి, భూగర్భ జలాలు నిల్వ ఉండడానికి, నేల సారాన్ని కాపాడడానికి చెట్లు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.. భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతి, స్వచ్ఛమైన గాలి, సమృద్ధిగా నీటి వనరులు అందించాలంటే ఇప్పటి నుంచే చెట్ల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. అమ్మ పేరుతో ఒక మొక్క - భూమాతకు మనం ఇచ్చే గొప్ప కానుక అని ఆయన పేర్కొన్నారు.

# ఈ నెల 10న మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

**– ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ డీసీవో ఎ.మురళీకృష్ణ**

**విజయవాడ,జూన్,08,(మనం న్యూస్)‌:** డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు ఈ నెల 10న జి.కొండూరు మండలం కుంటముక్కలలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ జిల్లా సమన్వయ అధికారి (డీసీవో) ఎ.మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలికలకు సంబంధించి మోటూరు, బల్లిపర్రు పాఠశాలల్లో, బాలురుకు సంబంధించి రుద్రవరం, పామర్రు, తిరువూరు, కృష్ణరావుపాలెం పాఠశాలల్లో ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. సీట్లు పరిమితంగా ఉన్నాయని.. అయిదో తరగతి నుంచి 9వ తరగతి, జూనియర్ ఇంటర్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ప్రజా వేదికకు మొత్తం101 ఫిర్యాదులు

**భూ వివాదాలే అధికం.. బాధితులతో మాట్లాడిన డీసీపీ ఉదయారాణి**

**విజయవాడ సెంట్రల్, జూన్ 8( మనం న్యూస్)** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 101 ఫిర్యాదులు అందాయి. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ ఏబీటీఎస్ ఉదయారాణి కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.అందిన ఫిర్యాదుల్లో భూ, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలకు సంబంధించినవే అత్యధికంగా 56 ఉన్నాయి. భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించిన 8, మహిళా సంబంధిత నేరాలపై 8, కొట్లాటలకు సంబంధించి 5, వివిధ మోసాలకు సంబంధించి 3 ఫిర్యాదులు అందాయి. రోడ్డు ప్రమాదం, దొంగతనం కేసులకు చెరో ఫిర్యాదు నమోదు కాగా, ఇతర సమస్యలపై 19 వినతులు వచ్చాయి. ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వేదికను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని డీసీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పకడ్బందీగా గుడివాడలో యోగాంధ్ర

**▸▸ సంయుక్త కలెక్టర్ ఎం నవీన్**



**మచిలీపట్నం,జూన్ 8(మనం న్యూస్):** ఈనెల 10వ తేదీన గుడివాడలో యోగాంధ్ర కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం సంయుక్త కలెక్టర్ యోగాంధ్ర కార్యక్రమాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన గుడివాడలో లారీ, ఆటో డ్రైవర్ల సంఘాల ప్రతినిధులతో ఎన్టీఆర్ స్టేడియంలో పెద్ద ఎత్తున ఇతివృత్తం ఆధారిత యోగ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందుకోసం వారితో ముందుగానే మాట్లాడాలన్నారు. ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములు చేయాలన్నారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. యోగాలో పాల్గొనే వారికి మంచినీరు, రాగిజావ అందుబాటులో ఉంచాలన్నారు. గుడివాడ ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు పనులు సజావుగా జరిగేలా పర్యవేక్షించా లన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో యోగా శిక్షణకు స్థలాలు ఎంపిక చేసి, ట్రైనర్లను గుర్తించి వారికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా యోగా శిక్షణ తరగతులు నిర్వహించాల న్నారు.అన్ని గ్రామాల్లో సోమ మంగళవారాల్లో యోగా క్విజ్ వ్యాసరచన నినాదాలు వంటి పోటీలను నిర్వహించాల న్నారు. ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు మండల స్థాయిలో యోగా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్లో గుడివాడ ఆర్డీఓ బాల సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్, పలువురు తహసీల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఆయుష్ శాఖ వైద్యులుఅధికారులు పాల్గొన్నారు.



**అన్నదాతలకు అదనపు ఆదాయానికి వీలు**
**పాడి పశువుల్లో పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి**
**పశువుల ఉత్పాదకత పెంపునకు కార్యాచరణ**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

# పశు సంపదతో గ్రామాల్లో సుస్థిర సంపద

**విజయవాడ,జూన్,08,(మనం న్యూస్ ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి పశుసంపద కీలకమని, పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థిరమైన పాల ఉత్పత్తి ద్వారా రైతుల ఆదాయాన్ని సుస్థిరం చేసేందుకు పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ విధానంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి విలేజ్ హెర్డ్ ఫెర్టిలిటీ రిజిస్టర్ (వీహెచ్ఎఫ్ఆర్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో సకాలంలో చూలు కట్టించకపోవడం వల్ల రైతులు గణనీయంగా నష్టపోతున్నారని.. అందువల్ల ప్రతి పాడి పశువును దాని పునరుత్పత్తి, ఉత్పత్తి జీవిత చక్రాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ సకాలంలో చూలు కట్టించడం, క్రమబద్ధమైన ఈతలు, అధిక పాల ఉత్పత్తి, మెరుగైన పశు ఉత్పాదకతను సాధించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సకాలంలో ఈనే పశువుల వల్ల అధిక పాల దిగుబడి ఉంటుందని.. సకాలంలో చూలు కట్టించడం వల్ల అనుత్పాదక దినాలు తగ్గి రైతులకు అధిక ఆర్థిక లాభం కలుగుతుందన్నారు. అదేవిధంగా లింగ నిర్ధారిత వీర్యం వినియోగం వల్ల ఎక్కువ ఆడ దూడలు పుట్టి పాల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. కృత్రిమ గర్భధారణ, గర్భ నిర్ధారణ, వంధ్యత్వ నివారణ, పోషకాహార నిర్వహణ, దూడల సంరక్షణ వంటి శాస్త్రీయ పునరుత్పత్తి నిర్వహణ చర్యలు పశువుల ఉత్పాదకత పెంపులో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందని.. దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎం.హనుమంతరావు, ఉపసంచాలకులు డా. కె.చంద్రశేఖర రావు, డా. మోజెస్ వెస్లీ, డా. ఎస్.నాగభూషణరావు, ఏడీ డా. సునంద, పశు వైద్యులు డా. మనోజ్, డా. పంకజ్, డా. చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

## అత్యాధునిక గైనకాలజీ శస్త్రచికిత్సలపై వర్క్‌షాప్



**200 మందికి పైగా వైద్యుల హాజరు**

**విజయవాడ, సెంట్రల్ జూన్ 8 (మనం న్యూస్):** నగరంలోని క్యాపిటల్ ఆస్పత్రిలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ (ఏపీఎంసీ), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) విజయవాడ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 'లైవ్ అడ్వాన్స్డ్ మినిమల్లీ ఇన్వేసివ్ గైనకాలజీ వర్క్షాప్' నిర్వహించారు. అన్నయ వారి కళ్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ వైద్య నిపుణులు సుమారు 20 సంక్లిష్ట గైనకాలజీ శస్త్రచికిత్సలను ప్రత్యక్షంగా నిర్వహించి వివరించారు. వర్క్షాప్కు 200 మందికి పైగా వైద్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా క్యాపిటల్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరీష్ మన్నే మాట్లాడుతూ ఎండోమెట్రియో సిస్ సమస్యతో బాధపడుతున్న మహిళలకు అత్యాధునిక 3డీ ల్యాపరోస్కోపీ విధానం ఎంతో ప్రయోజనకరమని, దీనివల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులపై ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు వైద్యుల నైపుణ్యాభివృద్ధికి దోహదపడతాయని ఏపీఎంసీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ముంబై, నాగ్పూర్, కేరళకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## 10న రాజీవ్ రంజన్‌మిశ్రా పర్యటన

**ఈ సందర్శనను సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,జూన్, 08,(మనం న్యూస్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించి అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 10న ఉమ్మడి కృష్ణా జిల్లాలో పర్యటించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా, మచిలీపట్నం కలెక్టరేట్ ప్రాంగణంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు తదితర వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు, వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి వ్యక్తులు, సంస్థలు, సంఘాలు బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల ప్రభావం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలపై లిఖిత పూర్వక అభిప్రాయాలు ఛైర్మన్ వారికి లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సంబంధిత వర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

- **సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణం**
- **అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలి**
- **నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవు**
- **జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



# ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయి

**(విజయవాడ, మనం బ్యూరో):** అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయని.. సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణమన్న విషయాన్ని గుర్తించి అధికారులు ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. అంతకుముందు కలెక్టర్ లక్ష్మీశ శాఖల వారీగా అర్జీల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంతవరకు ఎన్ని అర్జీలు అందాయి? ఎన్ని పరిష్కరించారు? పరిష్కార నాణ్యత.. తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత ప్రజాస్నేహపూర్వకంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం జిల్లాస్థాయి అధికారులు స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి, సమస్య పరిష్కారంపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతపై పూర్తి బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులను స్వీకరించే సమయంలోనూ, పరిష్కరించే ప్రక్రియలోనూ అధికారులు నిబద్ధత, సహానుభూతితో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా సేవలు అందించడమే ప్రతి అధికారి ప్రధాన బాధ్యతగా భావించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



**జిల్లాస్థాయి కార్యక్రమానికి 151 అర్జీలు:**

ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్లో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 151 అర్జీలు రాగా.. వీటిలో పురపాలన, పట్టణాభివృద్ధి శాఖకు 33, రెవెన్యూకు 29, పంచాయతీరాజ్కు 17, పోలీసు శాఖకు 14 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా ఏపీఎస్డబ్ల్యూఆర్ ఈఐఎస్కు 9 అర్జీలు రాగా విద్య, ఆరోగ్యం, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల్కు ఆరు చొప్పున అర్జీలు వచ్చాయి. విద్యుత్, డీఆర్డీఏ, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు నాలుగు చొప్పున , పౌర సరఫరాలు 3, ఏపీఎస్ ఆర్టీసీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, రహదారులు-భవనాల శాఖలకు రెండు చొప్పున అర్జీలు అందాయి. బీసీ సంక్షేమం, సహకార, డ్వామా, ఎండోమెంట్, గృహ నిర్మాణం, ఇరిగేషన్, ఎల్డీఎం, ఆర్ఐవో, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిపెట్టి నిర్దేశ గడువులోగా నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పురోహితుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు అమలు చేయాలి




**▶▶ పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలి**

**▶▶ బ్రాహ్మణ మేధావుల సదస్సులో వక్తలు**

**గాంధీనగర్ జూన్ 8 మనం న్యూస్:** పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించి, పురోహితుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా విజయవాడ గాంధనగర్లోని ఓ హోటల్లో శ్రీ వేద విజ్ఞాన పరిషత్ చైర్మన్ దేవరకొండ బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రాహ్మణ మేధావుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పొదిల నారాయణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు తెన్నేటి సునీల్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్ శర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగాభట్ల రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం ఎందుకు గుర్తించాలి అనే అంశంపై వ్యవస్థాపకుడు యామిజాల నరసింహ మూర్తి మేధావులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి విచ్చేసిన ప్రత్యేక బ్రాహ్మణ మేధావి వర్గం పురోహితులు అనుభవిస్తున్న కష్టాలను అర్థం చేసుకుని అందరూ సంపూర్ణ మద్దతు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 2 లక్షల మంది పురోహితులకి భరోసా కావాలంటే కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టినట్లు పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించినట్లు ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేసి, పురోహితులు అందరికీ ఈఎస్ఐ ద్వారా వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇతర కులవృత్తుల తరహాలోనే పురోహితులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, సాధనాలు, వడ్డీలేని రుణాలు అందించాలని, 'పురోహిత మిత్ర' రుణాలపై వడ్డీరేటు తగ్గించి, నిబంధనలు సరళతరం చేయాలని, గోదావరి పుష్కరాలతో సహా అన్ని పుష్కరాలు, కుంభమేళాల్లో ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జారీ చేసే గుర్తింపు కార్డును ప్రభుత్వం అధికారికంగా అనుమతించాలని, ప్రభుత్వం అన్ని కులవృత్తులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నప్పుడు, పౌరహిత్యానికి నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని, కాబట్టి అన్ని కులవృత్తి ప్రోత్సాహకాలను రద్దు చేయాలని, లేదా పౌరహిత్యాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆయా అంశాలను పరిగణంలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య తరపున బ్రాహ్మణ మేధావి వర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

# షా బుఖారి దర్గాను సందర్శించిన సుప్రీం కోర్టు ప్యానల్ కౌన్సిల్ సభ్యులు చిరుమామిళ్ల క్రాంతి



**కొండపల్లి,జూన్,08,(మనం న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం కొండపల్లి గ్రామంలో వెలసిన సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా వారి దర్గాను సుప్రీం కోర్టులో కేంద్ర ప్రభుత్వం తరపున వాదించే ప్యానల్ కౌన్సిల్ సభ్యులు ₹చిరుమామిళ్ల క్రాంతి కుమార్₹ ఈరోజు షా బుఖారి బాబా సందర్శించారు.దర్గాకు విచ్చేసిన ఆయనకు షా బుఖారి లంగర్ ఖానా నిర్వాహకులు మొహమ్మద్ అల్తాఫ్ బాబా ఘనస్వాగతం పలికారు. ఇస్లాం సాంప్రదాయం ప్రకారం చిరుమామిళ్ల క్రాంతి కుమార్ ని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన దర్గాలో బాబా వారికి భక్తిశ్రద్ధలతో చాదర్, పూలు, చందనం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా మొహమ్మద్ అల్తాఫ్ అలీ రజా బాబా ప్రత్యేక 'దువా' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుమామిళ్ల క్రాంతి కుమార్ సమీప భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని, సుప్రీం కోర్టులో అత్యున్నత స్థానాన్ని అలంకరించాలని ఆకాంక్షిస్తూ, అందుకు బాబా వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరుకున్నారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, దర్గా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# ధార్మిక పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలు ప్రారంభం

**ప్రతిభ ఆధారంగానే ఎంపికలు:**

**దేవాదాయ కమిషనర్**

**విజయవాడ, పశ్చిమ జూన్ 8 (మనం న్యూస్ ):** రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వేదపారాయణదారులు, అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు, వంటస్వాములు తదితర ధార్మిక పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా వేదపారాయణదారుల పోస్టులకు మౌఖిక పరీక్షలు సోమవారం ప్రారంభమైనట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ తెలిపారు. విజయవాడ మాడపాటి అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలోని 342 ధార్మిక పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తుల పరిశీలన అనంతరం హాల్టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. ఈ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న అన్ని వైదిక సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఉన్న మల్టీజోన్-1 అభ్యర్థులకు విజయవాడలో, గుంటూరు నుంచి రాయలసీమ



వరకు ఉన్న మల్టీజోన్-2 అభ్యర్థులకు సీతానగరంలో ఈ నెల 16వ తేదీ వరకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఇతర జోన్లకు చెందిన పండితులు పరీక్షలు నిర్వహిస్తుండగా, డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు .పరీక్షల ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేస్తున్నామని, విద్యార్హతలు, వేదార్హతలు, అనుభవం, మౌఖిక పరీక్షలో ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి మెరిట్ జాబితా రూపొందిస్తామని చెప్పారు. మూడు ఇంటర్వ్యూ బోర్డులను ఏర్పాటు చేశామని, ఏ అభ్యర్థి ఏ బోర్డు ముందు హాజరవుతారో ముందుగా తెలియకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేదపారాయణదారుల పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తైన అనంతరం అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు తదితర పోస్టుల భర్తీని దశలవారీగా చేపడతామని కమిషనర్ తెలిపారు.

# రాయల్ ఎన్ఫీల్డ్ రాకతో ఏపీకి పెట్టుబడుల ఊతం

**▶▶ లోకేష్ చొరవతో పారిశ్రామిక వాతావరణం మెరుగుపడిందన్న ఎంపీ చిన్ని**

**విజయవాడ, పశ్చిమ జూన్ 8 ( మనం న్యూస్ )** రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని, అందువల్లే రాయల్ ఎన్ఫీల్ వంటి ప్రముఖ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేస్తున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురంలో ఉన్న రాయల్ ఎన్ఫీల్ షోరూమ్ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా షోరూమ్ యాజమాన్యం ఎంపీకి స్వాగతం పలికి సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలు, రాష్ట్రంలో ఉన్న వ్యాపార అవకాశాలపై వివరించింది. షోరూమ్లోని ఆధునిక సదుపాయాలు, వినియోగదారులకు అందిస్తున్న సేవలను పరిశీలించిన ఎంపీ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వేగవంతమైన అనుమతులు, పారదర్శక పరిపాలన, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్రం పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతోందన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల వైపు మొగ్గుచూపిన పరిశ్రమలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ను ఆశాజనక పెట్టుబడి కేంద్రంగా గుర్తిస్తున్నాయని పేర్కొన్నారు. రాయల్ ఎన్ఫీల్ వంటి సంస్థల రాకతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదం అవుతుందని తెలిపారు. పరిశ్రమలు రావడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో షోరూమ్ ప్రతినిధులు, వ్యాపార వర్గాల ప్రముఖులు, పార్టీ నాయకులు పరుచూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ చిన్ని షోరూమ్ సిబ్బందితో ముచ్చటించి, సెల్ఫీ వీడియోలు తీసుకుని వారిని ప్రోత్సహించారు.




# కనకదుర్గమ్మను దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్



**▶▶ రెండోసారి రాజ్యసభకు ఎంపికైన సందర్భంగా ప్రత్యేక పూజలు**

**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 8 (మనం న్యూస్):** రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్ సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భార్య, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. తన రాజకీయ ప్రస్థానం విజయవంతంగా కొనసాగాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగేలా ఆశీర్వదించాలని అమ్మవారిని ప్రార్థించారు. దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి కిషోర్ కుమార్ ఆయనకు అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్నదాన పథకానికి రూ.1.01 లక్షల విరాళం



**▸▸ పదవీ విరమణ సందర్భంగా అమ్మవారికి కానుక**

**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 8 (మనం న్యూస్):** ఐఅండ్పీఆర్ శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందిన వేమూరి ప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో విరాళం సమర్పించారు. తమ అల్లుడు కష్ణ, కుమార్తె శ్రీ సాయి సింధూర పేర్లపై రూ.1,01,116లను అమ్మవారి నిత్య అన్నదాన పథకానికి విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు, అర్చక స్వాముల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో దంపతులు విరాళాన్ని దేవస్థానానికి అందజేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. నిత్య అన్నదాన పథకానికి భక్తులు అందించే విరాళాలు వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ఉపయోగపడుతున్నాయని ఆలయ అధికారులు తెలిపారు.

# విద్యుత్ షాక్ బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం

**▸▸ సూర్యప్రకాశ్ కుటుంబాన్ని పరామర్శించిన గద్దె క్రాంతి కుమార్**



**విజయవాడ తూర్పు, జూన్ 8 (మనం న్యూస్ )** ఇటీవల ఫుడ్ కోర్టులో జరిగిన విషాద ఘటనలో విద్యుత్ షాక్కు గురై మృతి చెందిన 18వ డివిజన్కు చెందిన పందిటి సూర్యప్రకాశ్ కుటుంబానికి టీడీపీ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం రాణిగారితోటలోని బాధిత కుటుంబ నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సూర్యప్రకాశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తండ్రి మురళికి రూ.లక్ష నగదును అందజేశారు.ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉండాల్సిన యువకుడు అకాల మరణం చెందడం బాధాకరమని అన్నారు. విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచనల మేరకు సొంత నిధుల నుంచి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున కూడా తగిన సహాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అవసరమైన సహకారం అందజేస్తామని పేర్కొన్నారు. ఇటువంటి ప్రమాదాల సమయంలో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని సూచించారు. బీమా ఉంటే క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు కొంత మేర రక్షణ లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్యతో పాటు మైలామూరి ఫీరుబాబు, గొర్రిపర్తి నామేశ్వరరావు, తలపాటి ప్రసాద్, పగడాల వెంకటేశ్వరరెడ్డి, బలగాని శ్రీను, గోగుల ఏసుబాబు, అంబటి కాశీ, అంబడిపూడి దుర్గమ్మ, రెడ్డి మాలక్ష్మమ్మ, గోగుల గోపి, పత్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉండవల్లి కూడలి వద్ద ఇళ్లల్లో ముక్కు మూసుకొని యోగా



**▸▸ గత కొద్దిరోజులుగా ఇదే పరిస్థితి**

**తాడేపల్లి, జూన్ 8, మనం న్యూస్:** అదేంటి ముక్కు మూసుకుని యోగా అనుకుంటున్నారా!!! ఉండవల్లి సెంటర్ నుండి దిగువున ఇళ్ల మధ్య ఏ వీధిలోకి వెళ్లి చూసినా రోడ్డుపై మురుగు నీటి పారుదలే దర్శనమిస్తుంది.ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నా భరించలేని మురుగు వాసన రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.డ్రైనేజీల్లో మురుగు నీరు పారుదల లేక, సిల్టు తీయక....రోజుల తరబడి ఇలా ఉండడంతో...ఈ పరిస్థితి ని స్థానికులు తీవ్రంగా ఎదుర్కొంటున్నారుసైకిల్ తొక్కే చిన్న పిల్లలు, ద్విచక్ర వాహనాలు నడిపే మహిళలు, రోడ్డుపై మురుగు వలన జారీ పడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి రాజధాని ప్రాంతం, స్వచ్ఛ ఆంధ్ర అని , యోగ డే అని ఆర్భాటాలు చేసే మున్సిపల్ అధికారులు...తమ ఈ సమస్య ను తక్షణమే పరిష్కరించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# ప్రజల నుండి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి




**గుంటూరు నగర పాలక సంస్థ జూన్ 8 (మనం న్యూస్ ప్రతినిధి):** ప్రజల నుండి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి.సాంబశివరావు విభాగాదిపతులకు తెలిపారు. సోమవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అదనపు కమిషనర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ కు అందే ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం,డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సరఫరా మరియు వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.అర్జీల పరిష్కారంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి వివరించి,ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు.నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 41 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 17, రెవెన్యూ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 4, ఉపా సెల్ 1,అకౌంట్స్ విభాగానికి సంబందించి 2 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో సియంఓహెచ్ డాక్టర్ శాంతి కళ,డిసిపి సూరజ్ కుమార్,మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల మూలాలను గుర్తించేందుకు డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌తో విస్తృత పరీక్షలు నిర్వహిస్తున్నాం



**▸▸ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**గుంటూరు జూన్ 8 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. గంజాయి కార్యకలాపాలలో పాల్గొంటున్న నిందితులను గుర్తించి,వారి కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు,పాత గంజాయి నేరస్తులకు డ్రగ్ డిటెక్షన్ కిట్స్ తో విస్తృత స్థాయిలో యూరిన్ పరీక్షలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ క్రమంలో ఈరోజు ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు మరియు పాత గంజాయి నేరస్తులను బి.ఆర్. స్టేడియం నందు ఒకేచోటకు పిలిపించి, వారిలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు 'డ్రగ్ డిటెక్షన్ కిట్స్' ద్వారా యూరిన్ డ్రగ్ టెస్టులు నిర్వహించారు. మొత్తం 120 మందికి పరీక్షలు నిర్వహించగా, 17 మందికి పాజిటివ్ ఫలితాలు వచ్చాయి.గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ అబ్దుల్ అజీజ్,జిల్లా ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,ఐపీఎస్ స్వయంగా పరిశీలించారు.హాజరైన రౌడీ షీటర్లకు పాత గంజాయి కేసుల నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారు ప్రస్తుతం చేస్తున్న పనులను,వారి నివాసం ఉంటున్న ప్రదేశాలను,ఇంకా ఇతర వివరాలను ఆరాతీసి, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కౌన్సిలింగ్ నిర్వహించి, హెచ్చరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా నిర్వహించే పరీక్షల ద్వారా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను వినియోగించిన వ్యక్తులను ఖచ్చితంగా గుర్తించవచ్చని తెలిపారు. నిందితుల వద్ద మత్తు పదార్థాలు స్వాధీనం కాకపోయినా,ఇటీవల వాటిని వినియోగించారా లేదా అనే విషయం యూరిన్ టెస్ట్ ద్వారా వెల్లడవుతుందని చెప్పారు. దీంతో మత్తు పదార్థాల వినియోగదారులు చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునే అవకాశం ఉండదన్నారు. జిల్లాలో గంజాయి సేవించి దొంగతనాలు, దాడులు, ఆస్తి సంబంధిత నేరాలు మరియు ఇతర నేరాలకు పాల్పడుతున్న వారి సంఖ్యను తగ్గించేందుకు గత ఆరు నెలలుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గంజాయి కొనుగోలు, విక్రయాలు,రవాణా, నిల్వ మరియు వినియోగానికి సంబంధించిన కేసుల్లో సుమారు 400 మందికి పైగా నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానాల ముందు హాజరుపరిచినట్లు వెల్లడించారు.అలాగే, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 250కు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, యువజన సంఘాలు మరియు ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా వేలాది మంది విద్యార్థులు, యువత మరియు ప్రజలకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక,ఆర్థిక మరియు చట్టపరమైన నష్టాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న 'డ్రగ్ డిటెక్షన్ కిట్స్' పరీక్షల ద్వారా 500 మందికి పరీక్షలు నిర్వహించగా, 47 మందికి పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. పునరావృతంగా గంజాయి సంబంధిత నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ ఇప్పటికే 10 మందిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తాజాగా నిర్వహించిన డ్రగ్ టెస్టుల్లో పాజిటివ్గా తేలిన వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారి నేరపూరిత కార్యకలాపాలపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.గంజాయి సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించడమే లక్ష్యంగా,నిందితులు మత్తు పదార్థాలను ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు,ఎవరికి విక్రయిస్తున్నారు,వారి వెనుక ఉన్న నెట్వర్క్ ఏమిటి అనే అంశాలపై లోతైన దర్యాప్తు నిర్వహించి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. నేరాలకు పాల్పడిన పక్షంలో ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలు,శిక్షలు మరియు వ్యక్తిగత, కుటుంబ,సామాజిక జీవితాలపై పడే ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల నిర్మూలన మరియు నేరాల నియంత్రణ లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు,డ్రగ్ టెస్టులు, కౌన్సెలింగ్ మరియు అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని గుంటూరు జిల్లా పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ,కొత్తపేట సీఐ వీరయ్య ,పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్,పాత గుంటూరు ఎస్సై రెహమాన్ ,లాలపేట ఎస్ ఐ రవి ఈగల్ ఆర్ఎస్సై సునీల్, ఇతర అధికారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మసిస్టులు నకిలీ మందులను ప్రోత్సహించరాదు



**ఘనంగా మెడ్ ప్లస్ ఔషధ దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డిఎస్పీలు**

**గుంటూరు జూన్ 8 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు తూర్పు లా అండ్ ఆర్డర్ డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్ స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి అలహరి శ్రీనివాసరావు. వైద్యరంగంలో రోగుల ప్రాణాలు నిలబెట్టడంలో ఫార్మసిస్టులు అత్యంత నాణ్యతతో కూడిన కంపెనీ మందులు మాత్రమే అమ్మాలని నకిలీ మందులను ప్రోత్సహించకూడదని గుంటూరు నగర తూర్పు లా అండ్ ఆర్డర్ డిఎస్పి అబ్దుల్ అజీజ్ స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి అలహరి శ్రీనివాసరావు లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురు నగరంలో తొలిసారిగా అతిపెద్ద మెడ్ ప్లస్ ఫార్మసీ రిటైల్ షాపును డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, అలహరి శ్రీనివాసరావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతులు మీదుగా ప్రారంభించడం జరిగినది,ఈ సందర్భంగా మెడ్ ప్లస్ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్ చేతులు మీదుగా ఇద్దరు డిఎస్పి లకు శాలువా కప్పి మెమొంటోలు ఇవ్వడం జరిగినది సీనియర్ మేనేజర్ ఏ చందు నాయుడు, స్టోర్ మేనేజర్ వి మోహన్ కుమార్ లు మాట్లాడుతూ ఫార్మసీరంగంలో దిగ్గజ సంస్థగా ఉన్న మెడ్ ప్లస్ దేశవ్యాప్తంగా వేలాది శాఖలతో ఖాతాదారుల ప్రయోజనాల కోసం నాణ్యమైన మందులను అందిస్తుందని చెప్పారు. ప్రారంభోత్సవ సందర్భంగా మా వద్ద ప్రత్యేక డిస్కౌంటు 25 శాతం అందిస్తున్నామని, తమ కంపెనీ మెడ్ ప్లస్ బ్రాండ్ మందులపై 50 నుండి 80 శాతం రాయితీతో ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వారి సిబ్బంది పాల్గొన్నారు.

# పి ఆర్ జి ఎస్ వేదిక నందు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్



**గుంటూరు జూన్ 8 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ఙఊజూజీఛి ఎటఙ్ఛిర్చిుఛ్చి ఖఛీఛ్టీఛ్టుఞ్చుజూ ఊ్ట్ఛుర్ఘు పి ఆర్ జి ఎస్ భవనంలో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,ఐపీఎస్ పాల్గొని ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,ఆస్తి, కుటుంబ మరియు ఇతర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి ఫిర్యాదుదారుని ఓపికగా విన్న ఎస్పీ ,వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ వచ్చిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఫిర్యాదులు రాయడం తెలియని లేదా తమ సమస్యలను లిఖితపూర్వకంగా వివరించలేని వారికి పోలీస్ సిబ్బంది సహాయం అందించి,వారి తరపున వినతిపత్రాలను సిద్ధం చేసి సమర్పించేలా సహకరించారు.అదేవిధంగా, పి జి ఆర్ ఎస్ భవనంలో ప్రజలు సౌకర్యవంతంగా కూర్చొని తమ వంతు కోసం వేచి ఉండేందుకు అనుకూల వాతావరణం కల్పించబడింది.వృద్ధులు, మహిళలు మరియు దివ్యాంగులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించబడ్డాయి.ప్రజలకు న్యాయం అందించడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడం జిల్లా పోలీస్ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు మరియు వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు. పి జి ఆర్ ఎస్.కార్యక్రమాన్ని ప్రతి వారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ ఎస్పీ తో పాటు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ జీ వి రమణమూర్తి,మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి ,ట్రాఫిక్ డిఎస్పీ బెల్లం శ్రీనివాస్,సీసీఎస్ డిఎస్పీ మధు సూదన్ రావు,ఇతర అధికారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సుపరిపాలన కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

గుంటూరు జూన్ 8 (మనం న్యూస్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ది.12.06.2026 తేదీన తుళ్లూరు మండలం రాయపూడి గ్రామ రెవెన్యూ పరిధిలోని రిపబ్లిక్ డే పరేడ్ గ్రౌండ్లో సుపరిపాలన పేరుతో భారీ ప్రజా కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి సుమారు 10,000 మంది ప్రజలు హాజరుకానున్నట్లు అంచనా వేయబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో,కార్యక్రమ ప్రాంగణం,భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ,వాహనాల పార్కింగ్ సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించేందుకు గుంటూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందల్,ఐపీఎస్,స్థానిక పోలీస్ అధికారులతో ఈ రోజు (08.06.2026) సాయంత్రం విస్తృత స్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపూడి గ్రామ పరిధిలోని రిపబ్లిక్ డే పరేడ్ గ్రౌండ్,సమీపంలోని ఈ-6 రహదారి,అలాగే హైకోర్టు ఆవరణ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.



కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్,భద్రతా బందోబస్తు,ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా,ప్రజా ప్రతినిధులు,ఉన్నతాధికారులు, ప్రత్యేక అతిథుల రాకపోకలకు అవసరమైన భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తుళ్లూరు ఎస్డిపిఓ మురళీకృష్ణ, గుంటూరు ఎస్బి డీఎస్పీ అలహరి.శ్రీనివాస్,ఎస్బి సీఐ-1 మల్లికార్జునరావు,ఎస్బి సీఐ-2 మల్లికార్జునరావు,తుళ్లూరు పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ శ్రీనివాసరావు, తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ కోటేశ్వరరావు,ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గుంటూరు పి.జి.ఆర్.ఎస్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

**గుంటూరు, జూన్ 8 : (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ హాజరయ్యారు. ముఖ్యంగా పిజిఆర్ఎస్ లో ప్రజా సమస్యలు ఎక్కువ భాగం రెవిన్యూ విభాగానికి సంబంధించినవే ఉంటున్నందున ప్రత్యేక రెవిన్యూ క్లినిక్ లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ కు చేరుకున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేరుగా రెవెన్యూ క్లినిక్ లో ప్రవేశించారు.దాదాపు మూడు గంటలు రెవెన్యూ క్లినిక్ లో కూర్చుని వివిధ కౌంటర్ లలో వస్తున్న ఆర్జీలను పరిశీలించారు. ఆర్జీలను అధికారులు స్వీకరిస్తున్న తీరు,ప్రజలతో వ్యవహరిస్తున్న విధానం, స్పందిస్తున్న పరిస్థితిని గమనించారు.నేరుగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తరచుగా వచ్చే రెవిన్యూ సమస్యలను కులంకషంగా చర్చించారు. అర్జీదారుల నుండి వారి సమస్యలను సావధానంగా తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది మధ్య సాధారణ అధికారిలా కూర్చుని ప్రజలకు వివరిస్తున్న తీరు, అందులో ఎదుర్కొంటున్న సమస్యలను గమనించారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ కూడా ప్రధాన కార్యదర్శితో పాటు పాల్గొని అర్జీలు స్వీకరించారు. దివ్యాంగులు ఎక్కడ ఉంటే అక్కడకే₹ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలు విన్నవించుటకు కొంత మంది దివ్యాంగులు వచ్చారు.వీల్ చైర్ లలో కొంత మంది రాగా,కొంత మంది ఆటోలో వచ్చారు. వీరి పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ 'మీరు ఎక్కడ ఉంటే. మేము అక్కడకే వస్తాం' అంటూ వారి వద్దకు వెళ్ళి అర్జీలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ , జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,డి ఆర్ ఓ షేక్ ఖాజావలి , ఇతర అధికారులు పాల్గొన్నారు.



# యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలి

**గుంటూరు నగర పాలక సంస్థ జూన్ 8 (మనం న్యూస్ ప్రతినిధి):** యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలి,నగర కమిషనర్ మయూర్ అశోక్ యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుండి 21వ తేదీ వరకు గుంటూరు నగరంలో నిర్వహించనున్న యోగా అవగాహన, శిక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ నగరపాలక సంస్థ అధికారులను, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్లో సంబంధిత అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో సుమారు 5 లక్షల మంది ప్రజలు యోగాలో పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమాల సమర్థ నిర్వహణ కోసం కార్పొరేషన్ స్థాయిలో యూఎల్బీ కమిటీని, ప్రతి వార్డులో స్వర్ణ వార్డు స్థాయి కమిటీలను ఏర్పాటు చేసామని, యూఎల్బీ కమిటీకి కమిషనర్ చైర్మన్గా వ్యవహరిస్తుండగా, యోగాంధ్ర-2026 కార్యక్రమానికి ఉపా సెల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సమన్వయ బాధ్యతలను నిర్వహిస్తారని తెలిపారు. పాఠశాలలు,కళాశాలలు, కాలనీలు,మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.అలాగే రోజువారీ యోగా సాధన,ప్రధాన యోగా ప్రదర్శనలకు అనువైన వేదికలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డు స్థాయి ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించి,సంబంధిత ఫోటోలు మరియు నివేదికలను జీఎంసీ యోగాంధ్ర హెల్ప్డెస్కు పంపాలని ఆదేశించారు.



# రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్,సానా సతీష్ బాబు





**సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో నామినేషన్ పత్రాలు దాఖల**

గుంటూరు జూన్ 8 (మనం న్యూస్ ప్రతినిధి)ః కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు ఈ సందర్భంగా భాష్యం రామకృష్ణ కి,చింతకాయల విజయ్ కి,సానా సతీష్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు ఎమ్మెల్యే తెలిపారు.టిడిపి కేంద్ర కార్యాలయంలో అభ్యర్థులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, అనంతరం రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెం టీటీడీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడినుండి అసెంబ్లీకి చేరుకొని నామినేషన్ దాఖలు సమర్పించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో, నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు సమక్షత గౌరవం ఇవ్వడం తెలుగుదేశం పార్టీ సంప్రదాయం అని,కార్యకర్త అధినేత అనే నినాదాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు. మరోసారి ఆచరణలో చూపిస్తూ వీరిని ఎంపిక చేశారని, రాష్ట్ర ప్రయోజనాల సాధనలో, ప్రజల ఆకాంక్షలను జాతీయస్థాయిలో బలంగా వినిపించడంలో ఈ ముగ్గురు అభ్యర్థులు కీలక పాత్ర పోషిస్తారని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో స్పీకర్,డిప్యూటీ , అచ్చెన్నాయుడు,పలువురు మంత్రులు మరియు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.








# ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి







**లీ ఫార్మా ,లీ హెల్త్ డొమైన్. అద్వర్యంలో హెచ్బిఎల్ కంపెనీ ఉద్యోగులకు ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరం**

**లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి..**

విశాఖపట్నం,జూన్,08,(మనం న్యూస్)ః ప్రతి ఒక్కరు వ్యక్తి గతంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.ఎముకల,కీళ్ల పటిష్టతపై పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి అన్నారు. స్దానిక హెచ్బిఎల్ కంపెనీ ఉద్యోగుల కోసం ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరం.లీ ఫార్మా లిమిటెడ్ , లీ హెల్త్ డొమైన్ , హెచ్బిఎల్ కంపెనీ భాగస్వామ్యంతో తమ ఉద్యోగుల కోసం 2026 జూన్ 8 (సోమవారం) ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.ఈ వైద్య శిబిరం ద్వారా దాదాపు 150 మంది ఉద్యోగులు లబ్ధి పొందారు. శిబిరంలో పాల్గొన్న వారికి కింది విధంగా వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు: హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్ (చేతి పట్టు బలం) బిఎమ్ఐ (ఆఋ - బాడీ మాస్ ఇండెక్స్) హెచ్బి ( హిమోగ్లోబిన్) ఆర్బిఎస్ ( రాండమ్ బ్లడ్ షుగర్) బిపి ( - రక్తపోటు) బోన్ మినరల్ డెన్సిటీ ( ఎముక ఖనిజ సాంద్రత) బాడీ కాంపోజిషన్ అనాలిసిస్ (శరీర కూర్పు విశ్లేషణ)ఈ పరీక్షల అనంతరం, వైద్యులు మరియు పోషకాహార నిపుణులు (న్యూట్రిషనిస్టులు) నివేదికలను పరిశీలించి, అవసరమైన ఆహారపు అలవాట్లు మరియు జీవనశైలి మార్పులపై ఉద్యోగులకు వ్యక్తిగత కౌన్సెలింగ్ మరియు సలహాలను అందించారు. ప్రముఖులుఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు, వారిలో అల్లా లీలా రాణి (డైరెక్టర్, లీ ఫార్మా లిమిటెడ్ మాట్లాడుతూ శరీరంలో ఎముకలు,కీళ్లు ముఖ్యమైనవని వాటిని సంరక్షిచుకోవడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు..ఈ కార్యక్రమంలో సరోజిని మరియు జయలక్ష్మి,(క్యాంప్ కోఆర్డినేటర్లు) డాక్టర్ రావు బాబు. మాధురి మరియు.క్రాంతి (పోషకాహార నిపుణులు) .భాగ్యలత మరియు పవని. హెచ్బిఎల్ బృందం లీ ఫార్మా సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు..

